క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



యాగ పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది తీరానున్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలు మూడు రోజులు నిర్వహించడానికి వీలుగా యాగ పూజలను ప్రారంభించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు రేపు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పట్టణ ప్రధాన రహదారిలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, పురపాలక సంఘం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

ఘనంగా హనుమాన్ జయంతి



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

సీతానగరం: ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాతీయ రహదారిలో ఉన్న మండల కేంద్రం జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో నాగరాజు శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి పూజలు నిర్వహించారు. మరిపివలస, రంగంపేట, కె.సీతారాంపురం గ్రామాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించడంతో పాటు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తనలు



సంగంవలస గ్రామంలో నగర సంకీర్తనలో రామభక్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో రామమందిరం వద్ద భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి సామూహిక హారతినిచ్చారు. శనివారం చైత్రశుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీరామ భజనమండలి సభ్యులు ఆధ్వర్యంలో వేకువజామున జైశ్రీరామ్ నామాన్ని స్మరిస్తూ సంగంవలస పురవీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించారు. సాయంత్రం రామమందిరం వద్ద భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పిమ్మట స్వామివారికి సామూహిక హారతిని ఇచ్చారు. అనంతరం భక్తులు అర్చకులు ఇచ్చిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.

130 మందికి నేత్ర పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, నిర్వాహకులు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ అనుబంధ రంగాలు సంయుక్తంగా శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కిమ్స్ వైద్య సిబ్బంది నేతృత్వంలో 130 మంది బాధితులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారని నిర్వాహకులు మజ్జి వీరన్నాయుడు, బబ్బాది శివ, జి.రవి, బి.బాషా, తదితరులు తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

సంతకవిటి: సంతకవిటి మండలం, జావాం గ్రామంలో అంతర్‌జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పగడాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అరకు జిల్లాల వాలీబాల్ జట్లు హాజరై, సత్తా చాటుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ మ్యాచ్‌లు ఎంతో ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి.

కార్పొరేట్ తీరుతో బేజారు!

- ఉపాధ్యాయులు, సిబ్బందిపై అడ్మిషన్ల కత్తి
- లక్ష్యాల పేరిట తీవ్ర ఒత్తిడి
- కార్పొరేట్ విద్యా సంస్థల తీరిది



పార్వతీపురం: విద్య వ్యాపారంగా మారిన తరుణంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయి. కార్పొరేట్ హంగులతో తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులను వసూలు చేస్తున్నారు. అడ్మిషన్లు పెంచుకోవడానికి లేని వసతులు ఉన్నట్లు చెబుతూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా అడ్మిషన్లు చేయాలని యాజమాన్యం లక్ష్యాలను విధిస్తున్నారు. అడ్మిషన్లు చేస్తే సెలవుల్లో జీతాలు ఇస్తామని, ఉద్యోగం సైతం పదిలంగా ఉంటుందని యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బంది తమ లక్ష్యాలను పూర్తి చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మండుటెండల సైతం లెక్క చేయకుండా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కేంపైన్ నిర్వహిస్తూ మీ పిల్లలను మా విద్యా సంస్థలో చేరి్పంచండని ప్రాధేయపడుతున్నారు.

లక్ష్యాలతో సిబ్బందిపై ఒత్తిడి

ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వహించే బోధన, బోధనేతర సిబ్బందికి అడ్మిషన్ల టార్గెట్లు ఇవ్వడం శోచనీయం. చాలీచాలని జీతం, వెట్టి చాకిరితో సతమతమవుతున్న వారిపై అదనపు టార్గెట్లు ఇవ్వడం మరింత ఇబ్బందికరం. ప్రవేశాలకు టార్గెట్లు ఇచ్చి సిబ్బందిపై ఒత్తిడి చేయడం సరికాదు. ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ సంస్థలపై విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– నాని, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం జిల్లా

అడ్మిషన్ల వేట

ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల సిబ్బంది అడ్మిషన్ల వేట మొదలు పెట్టారు. పీఆర్‌ఓల పేరుతో సిబ్బందిని నియమించుకొని పదో తరగతి చదువుతున్న విద్యార్థుల చిరునామాలను సేకరించి వాళ్ల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. ఇప్పుడే అడ్మిషన్ చేయించుకుంటే ఫీజులో రాయితీ వస్తుందని, ఆలస్యమైతే ఫీజులు పెరుగుతాయని తల్లిదండ్రులను నమ్మిస్తున్నారు. మా కళాశాలలో చేర్పిస్తే మీ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత మాదని వివరిస్తూ తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

మోసపోవడం తల్లిదండ్రుల వంతు

ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రత్యేకతలను గ్రాఫిక్స్‌లో చూపించడంతో తల్లిదండ్రులు ఆకర్షణలో పడి మోసపోవడం పరిపాటిగా మారుతుంది. తమ విద్యా సంస్థలలో ఉన్న సౌకర్యాలను వివరించి ఊహా లోకంలోకి దించుతుంటారు. రోజువారీ టెస్టులు, ప్రతీ రోజు స్టడీ అవర్స్, కంప్యూటర్, లైబ్రరీ, ల్యాబ్, ప్రతీ పండగకు సెలబ్రేషన్స్, ఆటపాటలతో పాటు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగుల బదిలీ అయితే అదే చోట బ్రాంచ్‌కు విద్యార్థుల బదిలీ సౌకర్యం కల్పిస్తామని కార్పొరేట్ స్కూళ్ల సిబ్బంది, పీఆర్‌ఓలు వివరిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకొని కట్టించుకొనే వరకు పాఠశాల ఫీజు మాత్రమే చెబుతారు. తరువాత యూనిఫాం, బుక్స్ ఫీజు అంటూ ముక్కు పిండి వసూళ్లు చేస్తుంటారు. అయితే చేసేది లేక కళాశాలలకు ఫీజులను చెల్లిస్తుంటారు.

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ఎం చరణ్‌తేజ, కె.అభిరాం, జి వసుంధరరావు, వి గణేష్, ఎం విషాక్, ఆర్.రమాదేవి

సీతానగరం: ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయ విద్యార్థులు సత్తా చాటి శత శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో కారం అభిరాం 997(ఎంపీసీ), మండంగి జయకార్ 979(బైపీసీ), ప్రథమ సంవత్సరంలో వంతల గణేష్ 456/470(ఎంపీసీ), మండంగి విషాక్ 408/480(బైపీసీ) మార్కులు సాధించారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఫలితాల్లో 88 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వృత్తి విద్యా కోర్సుల్లో కళాశాల టాపర్‌గా సెకండియర్‌లో ఎం.చరణ్ తేజ(ఎంఅండ్‌ఏటీ) 926 మార్కులు సాధించాడు. జనరల్ కోర్సుల్లో కె.రాజేశ్వరి 441/500 (సీఈసీ), ఆర్.రమాదేవి 474/500(ఎంపీహెచ్‌డబ్ల్యూ) మార్కులు సాధించారు. చినబోగిలి వీవీకే కళాశాలలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి చీకటి రిషిత 972(ఎంపీసీ), ప్రథమ సంవత్సరంలో అల్లు యోగేశ్వర్ 431/470(ఎంపీసీ) మార్కులు సాధించారు. కేజీబీవీ జోగింపేటలో ఫస్టియర్‌లో 95 శాతం, ద్వితీయ సంవత్సరం 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ మధుసూదనరావు తెలిపారు.

పార్వతీపురం టౌన్: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని పలు విద్యా సంస్థల విద్యార్థులు తమ సత్తా చాటారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 60 శాతం, ద్వితీయ సంవత్సరం 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని కె.పవిత్ర 429 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పార్వతీపురం ఆర్‌కే జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో వి.చాందిని 435, జి.దీప్తి 464, కె.సాయికుమార్ 461, జి.జశ్వంత్ కుమార్ 459, బి.రజిని 455, బి.సాయి అమృత 454, వి. జశ్వంత్ 453, ద్వితీయ సంవత్సరంలో బి.దీపిక 985, టి.కృష్ణసృజన 979, ఎస్.మౌనిక 978, డి.సాహు 975, ఆర్.పవన్‌కుమార్ 971, పి.శ్రీనుకుమార్ 969, జి.ప్రసన్న 962 మార్కులు సాధించారు.

వాసవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపీసీ గ్రూపులో ఎస్.హర్షిని 983 మార్కులు, బైపీసీ గ్రూపులో సాయి సంవత్ 983, మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో సీహెచ్ రాకేష్, పి.పవన్‌కుమార్, పి.భరత్‌కుమార్ 431 మార్కులు సాధించారు. భాస్కర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో రెడ్డి శంకర్ 458, పసుపురెడ్డి 452, కరణంపల్లి గాయత్రి 450, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మడక అశోక్ 959 మార్కులు సాధించారు.

ఐటీడీఏలో నిధుల వినియోగంపై దర్యాప్తునకు డిమాండ్



ఐటీడీఏ వద్ద నిరుపయోగంగా ఉన్న యంత్రాలను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏలో ఉన్న సమస్యలను పరిష్కారం దిశగా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద వృథాగా పడి వున్న యంత్రాలను ఎందుకు ఉపయోగించడం లేదని, అలాగే వీడీవీకే శిక్షణలు, అడ్వాన్సులు, కొనుగోళ్లు తదితర కార్యకలాపాలపై దర్యాప్తు నిర్వహించాలని, అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న ఏపీడీపై విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం అవతరించిన ఐటీడీఏలో ఉన్న గిరి వెలుగు అంతా అవినీతి మయమైందని ఆరోపించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి యంత్రాలు కొనుగోలు చేసి వాటిని నిరుపయోగంగా కార్యాలయాల వద్ద ఉంచడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ పరికరాలను లబ్ధిదారులకు అప్పగిస్తే ఎంతోకొంత జీవనోపాధి కలిగేదని, సంబంధిత అధికారులు ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంగల దాలినాయుడు, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్, సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి, సీపీఐ నాయకుడు పి.సంఘం ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

అమ్మవలసలో సెర్ప్ అడిషినల్ సీఈఓ పర్యటన

పాచిపెంట: మండలంలో సెర్ప్ అడిషినల్ సీఈఓ పర్యటన శ్రీరాములునాయుడు శనివారం పర్యటించారు. మహిళా సంఘాల సభ్యులకు జీవనోపాధులు, వార్షిక అప్పులపై వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలు చైతన్యవంతంగా ఉండాలని తెలిపారు. సెర్ప్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులతో సమావేశాలు



గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ గోపీకృష్ణ

భామిని: మండలంలోని మనుమకొండ, పాలవలస, నల్లరాయిగూడలలో గిరిజన రైతులతో మత్స్యశాఖ డివిజనల్ అధికారి డబ్బీరు గోపీకృష్ణ శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ధాత్రి అభిజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. పెంపకందారులకు అవసరమైన వలలు, ఐస్‌బాక్సులు, వాహనాల కసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్‌హెచ్‌జీలు, మత్స్యకార సంఘాలు, రైతు సమాఖ్యలు, వన్‌ధన్ కేంద్రాల సభ్యులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. సమావేశాల్లో సర్పంచ్‌లు నిమ్మల కేశవ, బిడ్డిక తమ్మారావు, మత్స్యకార సిబ్బంది కె.ఆదినారాయణ, శోభన్, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు మరో అవకాశం

రామభద్రపురం: కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇదివరకు ఈ కళాశాల్లో అడ్మిషన్లకు ఇచ్చిన గడువు ముగియగా, ఇప్పుడు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. బూసాయవలస కేజీబీవీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దీప శనివారం తెలిపారు.

షిర్డీసాయి ఆశీస్సులు ప్రజందరిపై ఉండాలి



పూజలు చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: షిర్డీ సాయి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. మండలంలోని శివరాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన శనివారం పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాజన్నదొరకు వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలతో స్వాగతం పలికారు. శ్రీ విద్యాసర్వమంగళాదేవి పీఠం వ్యవస్థాపకులు మురపాక కాళిదాసు శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, జర్జాపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు సీసీ కెమెరాల వితరణ



సీసీ కెమెరాలు వితరణ చేసిన షణ్ముఖతో ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు

పార్వతీపురం రూరల్: నేరాల అదుపులో.. కనిపెట్టడంలోనూ.. శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు క్రియాశీలకు పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లి షణ్ముఖ అనే యువకుడు జిల్లా పోలీసు శాఖకు రూ.1.20వేలు విలువ చేసే సీసీ కెమెరాలను అందజేశారు. ఈ మేరకు నేరాలను అదుపు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాలను వితరణ చేసినందుకు షణ్ముఖను ఎస్పీ పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సత్కరించారు. వితరణగా ఇచ్చిన 40 సీసీ కెమెరాలు, డీవీఆర్‌లను వాటికి కావాల్సిన పరికరాలను పాచిపెంట మండల పరిధిలో, మరికొన్ని గ్రామాల్లో ఉపయోగించనున్నట్టు ఎస్పీ తెలిపారు. సామాజిక స్పృహతో షణ్ముఖ సీసీ కెమెరాలు వితరణకు ముందుకు రావడంతో ఆయన సేవా దృక్పథాన్ని కొనియాడారు.

1226 కెమెరాలు ఏర్పాటు

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిఘా నిమిత్తం 1226 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ 2015 ప్రకారం వ్యాపార సముదాయాల యాజమాన్యం వారు, విద్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఇతర సముదాయాల వద్ద కెమెరాలను తప్పనిసరిగా నిర్వాహకులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకితా సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్‌బీ సీఐ రంగనాధం, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, ఏఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, ఎస్ఐ వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై తహసీల్దార్ దర్యాప్తు



భూ వివాదంపై దర్యాప్తు నిర్వహిస్తున్న తహసిల్దార్ షేక్ ఇబ్రహీం

మక్కువ: సాక్షి సంతకం పెట్టాలని నమ్మబలికి భూమిని రైతుకు తెలియకుండా రెండున్నర ఎకరాల మెట్టు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న బాధితుల ఆరోపణపై పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహిం శనివారం విచారణ చేశారు. బాధితులు దీసరి అప్పలస్వామి, ఆయన కుమారుడు వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం మక్కువ మండలం ఎస్.పెద్దవలస గ్రామానికి చెందిన పూడి తిరుపతిరావు తమ పొలం పక్కనే తాను కొంత సాగు భూమిని కొనుగోలు చేశానని, సాలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందని, సాక్షి సంతకం కోసం రావాలని కోరగా వెళ్లామని తెలిపారు. తమకు భోజనం ఖర్చుల కోసం రూ.2వేలు అందించి సబ్ రిజిస్టర్ నగదు ఇచ్చారని అడిగితే ఇచ్చారని చెప్పమనగా తాము చెప్పామని వాపోయారు. ఇటీవల డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసేందుకు, సచివాలయానికి వెళ్లి వన్ బీ తీయగా సర్వే నంబరు 266 – 1లో 2.50 ఎకరాల భూమిని పూడి తిరుపతిరావుకు తాము అమ్మినట్టు ఉందని సచివాలయ సిబ్బంది చెప్పగా అవాక్కయ్యామని తెలిపారు. తాము తిరుపతిరావును ప్రశ్నించగా పొరపాటు జరిగిందని, తమ భూమి అప్పగిస్తానని చెప్పి ఆరు నెలలు దాటినా అప్పగించలేదన్నారు. మళ్లీ అడగ్గా మీ దిక్కున్నచోట చెప్పుకొండని తిరుపతిరావు భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని బాధిత గిరిజన రైతులు వాపోయారు. దీనిపై బాధితులు ఉన్నతాధికారులను ఆశ్రయించగా విచారణ చేపట్టారు. ఈ విషయమై ఎవరైతే దోషులని తేలితే వారిపై క్రిమినల్ చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వేతనదారులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, టి.గోవిందమ్మలు.. ప్రకృతి సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను వేతనదారులకు వివరించారు. ప్రకృతి సాగులో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అలాగే నేల సారవంతానికి ఎకరా పొలంలో 12 కిలోల నవధాన్యాలు వేసుకుని 45 రోజుల తర్వాత కలియదున్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు



సీసీ ఫుటేజీ దృశ్యాలు పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలిరూరల్: మండలంలోని రాముడువలస గ్రామ బాపిస్ట్ చర్చి వద్ద ఆ చర్చి నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్యమత ప్రచారాలు జరుగుతున్న దృష్ట్యా అన్ని మతాల ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరూ మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సీఐ సూచించారు. నేరాల నియంత్రణలో ఉపయోగపడుతున్నాయన్న నేపథ్యంలో వీలైనంత మందితో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.